ఆదరించండి..మరింత అభివృద్ధి చేస్తా..

- బెల్లంపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య
- కన్నెపల్లిలో ఎమ్మెల్యే ప్రచారానికి విశేష స్పందన

లింగాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

కన్నెపల్లి, నవంబర్ 4 : ప్రజలు ఆదరించి మళ్లీ గెలిపిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే, బెల్లంపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి దుర్గం చిన్నయ్య అన్నారు. శనివారం మండలంలోని లింగాల, నాయకుని పేట, మెట్‌పల్లి, ముత్తాపూర్, రెబ్బెన , జజ్జరవెల్లి, జన్కాపూర్ గ్రామాల్లో ప్రచారాన్ని ఆయన ప్రారంభించారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రజలను కలిసి కారు గుర్తుకు ఓట్లు వేయాలన్నారు. రోడ్ షో నిర్వహిస్తూ ప్రజలకు బీఆర్ఎస్ చేసిన అభివృద్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీ కుటుంబ సభ్యుల్లో ఒకడినైనా తనను అధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. ఇప్పటికే నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేశానని, అభివృద్ధి మీ కళ్ల ముందు కనబడుతుందన్నారు. హైదరాబాద్ నుంచి డబ్బుల కట్టలతో వచ్చే వారిని నమ్మవద్దని, ఎన్నికలు వస్తేనే వారికి ఇక్కడి ప్రజలు గుర్తుకు వస్తారని, అలాంటి వారికి ఓట్లు వేస్తే అభివృద్ధి జరగదని, ప్రజలకు అందుబాటులో ఉండరని ప్రజలు గమనించాలన్నారు. బీజేపీ, కాంగ్రెస్ మాటలను నమ్మి ప్రజలు మోసపోవద్దన్నారు. సీఎం కేసీఆర్ అన్ని వర్గాల సంక్షేమానికి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ పార్టీయేనని తెలిపారు. రైతుబంధు రూ. 16 వేలకు పెంచుతున్నట్లు మ్యానిఫెస్టోలో ప్రకటించినట్లు తెలిపారు. అన్ని కుల వృత్తుల సంక్షేమానికి కృషి చేసిన ఏకైక సీఎం కేసీఆర్ అన్నారు. సీఎం కేసీఆర్‌తోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో ప్రజలందరూ కారు గుర్తుకు ఓట్లు వేసి గెలిపించాలన్నారు. ఈ సందర్భంగా చిన్నయ్యకు మద్దతుగా యువకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ నిరంజన్ గుప్తా, కన్నెపల్లి జడ్పీటీసీ కౌటారపు సత్యనారాయణ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సాయిని రంగారావు, యువజన సంఘం అధ్యక్షుడు జిల్లెల్ల మహేశ్‌గౌడ్, సర్పంచులు సీపెల్లి లక్ష్మి, సుంకరి తిరుపతి, ఎంపీటీసీ వర ప్రసాద్, నాయకులు పుల్లూరి రాజయ్య, నెండుగురి సంతోష్, రవి, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలు పోషక్క, దివ్యాంగుడిని ఓట్లు వేయాలని కోరుతున్న దుర్గం చిన్నయ్య

'అవ్వా నీ ఓటు నాకే వేయాలి..'

మండలంలోని లింగాల గ్రామంలో ప్రచారం నిర్వహించిన బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య గ్రామంలోని పోషక్క అనే వృద్ధురాలిని ఆప్యాయంగా పలుకరించారు. ఆరోగ్యం ఎలా ఉందని , పింఛన్ వస్తుందా అని అడిగి తెలుసుకున్నారు. పింఛన్ వస్తుందని వృద్ధురాలు తెలిపింది. 'నా ఓటు నీకే వేస్తాను బిడ్డా' అని దుర్గం చిన్నయ్యకు తెలిపింది. అనంతరం దివ్యాంగుడైన వృద్ధుడిని పలుకరించారు. తాత కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు.

నేడు బెల్లంపల్లి మండలంలో ఎమ్మెల్యే ప్రచారం

బెల్లంపల్లిరూరల్, నవంబర్ 4: బెల్లంపల్లి మండలంలో ఆదివారం బీఆర్ఎస్ పార్టీ బెల్లంపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి దుర్గం చిన్నయ్య ఎన్నికల ప్రచారం చేయనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు సింగం గణేశ్‌గౌడ్ తెలిపారు. ఉదయం 9 గంటలకు లింగాపూర్, 10 గంటలకు ఆకెనపల్లి, 11గంటలకు బుచ్చయ్యపల్లి, 12 గంటలకు పాతబెల్లంపల్లి, మధ్యాహ్నం 1 గంటకు సోమగూడెం, 2 గంటలకు కన్నాల గ్రామపంచాయతీల్లో నిర్వహించనున్న ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకురాళ్లు, రైతు బంధు సమితి మండల, గ్రామ కో ఆర్డినేటర్లు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

లింగాలలో ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న యువకులు

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం

- ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మమత

తాండూర్, నవంబర్ 4 : శిశువులకు తల్లిపాలే శ్రేయస్కరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మమత అన్నారు. మండలంలోని కొత్తపల్లిలోని అంగన్‌వాడీ సెంటర్‌లో సామాజిక వేడుకల్లో భాగంగా ఇద్దరు గర్భిణులకు సామూహిక సీమంతాలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లు గ్రామ స్థాయిలో మంచిగా పని చేసి ప్రజల్లో అవగాహన కల్పించి తల్లీబిడ్డల సంక్షేమానికి పాటుపడాలని సూచించారు. పుట్టిన శిశువుకు ముర్రుపాలు తాగించడం ద్వారా రోగ నిరోధక శక్తి పెరుగుతుందని, మూడేళ్ల వరకు తల్లి పాలు తాగిస్తే తగిన పోషక ఆహారాలు అందుతాయన్నారు. గర్భిణులు సరైన పోషక ఆహారం తీసుకోవడం, తల్లిపాల విశిష్టత, విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు స్వప్న, ఏఎన్ఎం నవిత, అంగన్‌వాడీ టీచర్లు ప్రమీళ, లక్ష్మి, ఆశ కార్యకర్త అనురాధ, ఆయా, గర్భిణులు, బాలింతలు, తల్లులు, కిశోర బాలికలు, తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లిలో గర్భిణులకు సీమంతం చేస్తున్న సూపర్‌వైజర్ మమత, అంగన్‌వాడీ టీచర్లు

తాత్కాలికంగా గదుల కేటాయింపు

మార్కెట్ భవన గదులను శుభ్రం చేస్తున్న పారిశుధ్య సిబ్బంది

బెల్లంపల్లి, నవంబర్ 4: బెల్లంపల్లి పట్టణంలోని మార్కెట్ ఏరియాలో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవనంలో తాత్కలికంగా విక్రయాలు చేసుకునేందుకు మున్సిపల్ అధికారులు అనుమతి ఇచ్చారు. భవనానికి స్లాబ్ వేస్తున్న క్రమంలో చుట్టుపక్కల వ్యాపారులపై దుమ్ము పడుతుందనే వీటిని కేటాయించినట్లు మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య తెలిపారు. ఈ క్రమంలో మార్కెట్ భవనాన్ని మున్సిపల్ పారిశుధ్య కార్మికులు శుభ్రం శనివారం శుభ్రం చేశారు. భవన నిర్మాణం పూర్తయిన తర్వాత అర్హులైన వారందరికీ గదులు కేటాయిస్తామని కమిషనర్ వెల్లడించారు.

7న వాలీబాల్ ఎంపిక పోటీలు

బెల్లంపల్లి, నవంబర్ 4: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 ఆధ్వర్యంలో బాలబాలికలకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలను ఈ నెల 7న బెల్లంపల్లి సీవోఈలో నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బాబురావు తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని ఇంటర్ చదువుతున్న బాలురు సీవోఈ పీడీ వామన్, బాలికలు రెసిడెన్షియల్ బాలికల పీడీ రాధారాణిని సంప్రదించాలని సూచించారు. ఆసక్తి గల బాలబాలికలు ఉదయం 11 గంటలకు రిపోర్టు చేయాలని సూచించారు.

ఉచిత వైద్య పరీక్షలు

నమూనాలు తీసుకుంటున్న సీఎస్‌సీ క్యాంప్ సిబ్బంది

తాండూర్, నవంబర్ 4 : తాండూర్ గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో శనివారం తెలంగాణ భవన, ఇతర నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు ఆధ్వర్యంలో ఉచిత రక్త, మూత్ర నమూనాల పరీక్షల ల్యాబ్‌ను ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించారు. భవన నిర్మాణ, ఇతర నిర్మాణ రంగ కార్మికుల కుటుంబాలకు, గ్రామస్తులకు సీఎస్‌సీ హెల్త్ కేర్ ఆధ్వర్యంలో మొత్తం 50 కి పైగా వైద్య పరీక్షలు ఉచితంగా చేశారు. ఈ సందర్భంగా సీఎస్సీ హెల్త్ కేర్ క్యాంప్ కో ఆర్డినేటర్ జే సూరేశ్ మాట్లాడుతూ ఈ అధునాతనమైన పరీక్షల ద్వారా ఏమైనా అనారోగ్య సమస్యలున్నట్లయితే ముందుగానే తెలుసుకోవచ్చన్నారు. తద్వారా మెరుగైన వైద్య సేవల కోసం ఆరోగ్య సంరక్షణ, క్షేమం సులభంగా పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో క్యాంపు సిబ్బంది శివ, వినోద్, కృష్ణ ప్రసాద్, సాయి, లింగమూర్తి, పంచాయతీ కార్యదర్శి తపాస్ కుమార్, సిబ్బంది, గ్రామస్తులు, కార్మికులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మంచిర్యాలటౌన్, నవంబర్ 4: మంచిర్యాల పట్టణంలోని ఏసీసీ, రాజీవ్‌నగర్‌లో ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఏడీఈ రేగుంట స్వామి ఒక ప్రకటనలో తెలిపారు. మరమ్మతుల దృష్ట్యా ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

బాధిత కుటుంబానికి జాన్సన్ పరామర్శ

ఖానాపూర్ రూరల్, నవంబర్ 4 ఖానాపూర్ మండలం సూర్జాపూర్ గ్రామానికి చెందిన బోయిని లస్మయ్య శనివారం మరణించగా వారి కుటుంబాన్ని బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్యా జాన్సన్ నాయక్ పరామర్శించారు. భౌతిక కాయన్ని సందర్శించి నివాళులర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి పలికారు. నాయకులు ఆకుల వెంకగౌడ్, బక్కశెట్టి అశోక్, బూసి నరేందర్, బొమ్మెన ప్రవీణ్, ఎర్రన్న, రాజన్న, అనుప హరిశ్, గాజుల గంగన్న, సునీత, గ్రామస్తులు పాల్గొన్నారు.